లక్ష్మీనృసింహుడికి శాస్త్రోక్తంగా నిత్యారాధనలు

ఊంజల్ సేవలో అమ్మవారి సేవను ఊరేగిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, సెప్టెంబర్ 13 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామివారికి నిత్యారాధనలు శాస్త్రోక్తంగా సాగాయి. శుక్రవారం తెల్లవారుజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వయంభూ నరసింహ స్వామిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి, ఉదయం ఆరగింపు చేపట్టారు. ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. వెలుపలి ప్రాకార మండపంలో స్వామి, అమ్మవార్లకు నిత్య తిరుకల్యాణోత్సవం శాస్త్రోక్తంగా జరిగింది. సాయంత్రం స్వామివారికి తిరువీధి సేవ, దర్బార్ సేవ అత్యంత వైభవంగా చేపట్టారు. అమ్మవారికి ఊంజల్ సేవోత్సవం నేత్రపర్వంగా సాగింది. ఆండాళ్ అమ్మవారిని పట్టువస్త్రాలు, బంగారు, ముత్యాలు, వజ్రాభరణాలతో దివ్య మనోహరంగా అలంకరించిన అర్చకులు ఆలయ ప్రాకార మండపంలోని అద్దాల మండపంలో అమ్మవారి ఊంజల్ సేవను తీర్చిదిద్ది వేదమంత్ర పఠనాలతో పూజలు నిర్వహించారు. ఆస్థాన విద్వాంసుల మంగళ వాయిద్యాలు, మహిళా భక్తుల మంగళ నీరాజనాల నడుమ ఊంజల్ సేవ తోత్సవం వైభవంగా సాగింది. పాతగుట్టలో స్వామివారికి నిత్యారాధనలు సాగాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. సుమారు 9వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలను కలుపుకొని స్వామివారి ఖజానాకు రూ.12,48,294 ఆదాయం సమకూరిందని ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

బీఆర్‌ఎస్ నాయకుల ముందస్తు అరెస్ట్

- హైదరాబాద్‌కు వెళ్లకుండా ఎక్కడికక్కడ అడ్డగింత
- పోలీస్‌స్టేషన్లు గులాబీ శ్రేణుల నిర్బంధం

మోత్కూరులో పోలీసులు అరెస్టు చేసిన బీఆర్‌ఎస్ నాయకులు

భువనగిరి అర్బన్, సెప్టెంబర్ 13 : హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై దాడి, మాజీ మంత్రి హరీశ్‌రావు అక్రమ అరెస్టుకు నిరసనగా హైదరాబాద్ సీపీ ఆఫీస్ ముట్టడి నేపథ్యంలో బీఆర్‌ఎస్ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. హైదరాబాద్‌కు వెళ్లకుండా జిల్లా వ్యాప్తంగా ఎక్కడికక్కడ నాయకులను అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్లకు తరలించారు. బీఆర్‌ఎస్ భువనగిరి పట్టణ ప్రధాన కార్యదర్శి రచ్చ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు ఖాజా అజీముద్దీన్, కడారి వినోద్, ఎండీ ఖాజం, పెంట నితీశ్, షేక్ మజార్‌పాషా, సిరిపంగ సుభాశ్, మోత్కుపల్లి అజయ్ తదితరులను పోలీసులు శుక్రవారం అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా పార్టీ పట్టణాధ్యక్షుడు ఏవీ కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఎన్ని అరెస్టులు చేసినా వెనుకంజ వేసేదిలేదని, ఇలాంటి అరెస్టులు బీఆర్‌ఎస్ పార్టీకి కొత్త కాదని అన్నారు.

ఆలేరు టౌన్ : ఆలేరు పట్టణంలో కొలుపుల హరినాథ్, ఏసీ రెడ్డి, మహేందర్‌రెడ్డి, ఎండీ రియాజ్, ఉప్పలయ్య, భరత్ యాదవ్, నాగరాజు, ఫయాజ్, మాధవ్, భిక్షపతి, రవి, మధుసూదన్, టింకు తదితరులను అరెస్టు చేశారు. ఈ సందర్భంగా పార్టీ పట్టణ అధ్యక్షుడు మల్లేశ్‌గౌడ్ మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి అరాచక పాలనకు చరమగీతం పాడాలన్నారు.

రాజాపేట : ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డికి మద్దతుగా హైదరాబాద్ తరలి వెళ్తున్న బీఆర్‌ఎస్ నాయకులను పోలీసులు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. అరెస్ట్ అయిన వారిలో మాడోతు దేవు నాయక్, లక్ష్మణ్‌నాయక్, రాజ్‌కుమార్, పాండు ఉన్నారు.

ఆత్మకూరు(ఎం) : హైదరాబాద్‌కు తరలి వెళ్లకుండా బీఆర్‌ఎస్ మండల నాయకులు పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. అరెస్ట్ అయిన వారిలో బీఆర్ ఎస్ జిల్లా నాయకులు కోరె భిక్షపతి, కాంబోజు భానుప్రకాశ్, ఆత్మకూరు(ఎం) గ్రామ శాఖ అధ్యక్షుడు కోరె వెంకన్న, ఎలిమినేటి ఎలేందర్, సతీశ్, విశాల్, నరేశ్ ఉన్నారు.

తుర్కపల్లి : బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు పిన్నపురెడ్డి నరేందర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ గిద్దె కర్ణాకర్, మాజీ సర్పంచ్ నామసాని సత్యనారాయణ, సోషల్ మీడియా మండల కన్వీనర్ ఐలేశ్, నాయకులు ఎండీ యాకుబ్, నర్సింగ్ రావు, శ్రీనివాస్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో అల్లర్లు సృష్టించి ఇచ్చిన వాగ్దానాలను పక్కతోవ పట్టించాలని కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తుందన్నారు. అరెస్టులు, నిర్బంధాలు తమకు కొత్తేమీ కాదన్నారు.

బొమ్మలరామారం : మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డికి మద్దతుగా హైదరాబాద్ వెళ్తున్న బీఆర్‌ఎస్ నాయకులను పోలీసులు ఆరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. అరెస్ట్ అయిన వారిలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు పోలగాని వెంకటేశ్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ గూదె బాలనర్సయ్య, నాయకులు కుషంగుల సత్యనారాయణ, బెజ్జంకి పాపిరెడ్డి, బండి మహేశ్ గౌడ్, ఎల్లబోయిన సత్యనారాయణ, కుక్కదువ్వు ఉపేందర్ ఉన్నారు.

భువనగిరి కలెక్టరేట్ : బీఆర్‌ఎస్ పట్టణ నాయకులు, కార్యకర్తలను రూరల్ పోలీసులు ఎక్కడికక్కడ అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు జనగాం పాండు మాట్లాడుతూ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై దాడి హేయమైనదన్నారు. బీఆర్‌ఎస్ పాలనలో రాష్ట్రం ఎంతో సుభిక్షంగా ఉందని, ఎక్కడా అల్లర్లకు తావులేదని గుర్తుచేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన కొద్ది నెలల్లోనే రాష్ట్రం చిన్నాభిన్నమవుతుందన్నారు. అరెస్టు అయిన వారిలో బీఆర్ ఎస్ మండల ప్రధాన కార్యదర్శి నీల ఓంప్రకాశ్‌గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ అబ్బగాని వెంకట్‌గౌడ్, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

బీబీనగర్ : మండలంలో బీఆర్‌ఎస్ నాయకులతోపాటు పలువురు ఉద్యమ నాయకులను పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం, పోలీసుల సహకారంతోనే ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై దాడి జరిగిందన్నారు. అరెస్టు అయిన వారిలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు రాచమల్ల శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి చింతల సుదర్శన్‌రెడ్డి, నాయకులు బొక్క జైపాల్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, నగేశ్, ఐలయ్య, భాస్కర్‌గౌడ్, రమేశ్, రాజేశ్వర్, బలవంత్‌రెడ్డి, లింగారెడ్డి, సత్యనారాయణ, నాగేశ్, రాజమల్లేశ్, నరసింహాచారి, భాస్కర్‌గౌడ్ ఉన్నారు.

అడ్డగూడూరు : బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు నాగులపల్లి దేవగిరి, నాయకులు మాదాను ఆంథోని, బాలెంల అయోధ్య, గజ్జెల్లి రవి, తాళ్లపల్లి కృష్ణ, గూడెపు పరమేశ్, గూడెపు నరేశ్, నిర్మల వెంకటేశ్వర్లు తదితరులను పోలీసులు అరెస్టు చేశారు.

మోత్కూరు : బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల అక్రమ అరెస్టులను నిరసిస్తూ ఆందోళనలు చేపట్టకుండా మండలంలో ఆ పార్టీ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌లో నిర్బంధించారు. ఇంట్లో ఉన్నవారిని అకారణంగా హౌజ్ అరెస్టు చేసి నిర్బంధించడం హేయమైన చర్య ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు. అరెస్టు అయిన వారిలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు పొన్నెబోయిన రమేశ్, మున్సిపాలిటీ అధ్యక్షుడు జంగ శ్రీను, నాయకులు కొణతం యాకూబ్‌రెడ్డి, గజ్జి మల్లేశ్, కొండ సోంమల్లు, కూరెళ్ల పరమేశ్, రమేశ్ ఉన్నారు.

గుండాల : హైదరాబాద్‌కు వెళ్లకుండా బీఆర్‌ఎస్ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. బీఆర్‌ఎస్ నాయకులను అక్రమంగా అరెస్టులు చేయడం హేయమైన చర్య అని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మండడి రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. అరెస్టు అయిన వారిలో నాయకులు గిరికత్తుల శ్రీనివాస్‌గౌడ్, గడ్డమీది మహోదయ్, అట్ల రంజిత్‌రెడ్డి, నాగెల్లి రమేశ్, వీరమల్ల సోమన్న, అన్నెపర్తి భిక్షం ఉన్నారు.

మోటకొండూర్ : హైదరాబాద్‌లో నిరసన కార్యక్రమానికి వెళ్లకుండా బీఆర్‌ఎస్ మండల నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. అరెస్టు అయిన వారిలో బోట్ల మహేశ్, కంకటి నరేశ్, కొంపెల్లి నర్సింహా, కొండమడుగు వీరనరసింహ ఉన్నారు.

వలిగొండ : హైదరాబాద్‌కు వెళ్లకుండా బీఆర్‌ఎస్ నాయకులు మహమ్మద్ అఫ్రోజ్, ఐటి పాముల సత్యనారాయణ, బల్గూరి నరేశ్‌రెడ్డి, కళ్లెం మారయ్య, పబ్బు స్వామి, పోలెపాక సత్యనారాయణను పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా అక్రమ అరెస్టులను పలువురు ఖండించారు.

భూదాన్ పోచంపల్లి : పట్టణంలో బీఆర్ ఎస్ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. అరెస్టు అయిన వారిలో మున్సిపల్ వైస్ చైర్మన్ బాతుక లింగస్వామి, కౌన్సిలర్ సామల మల్లారెడ్డి, దేవరాయ కుమార్, గుండు మధు, కర్నాటి రవీందర్, నాయకులు రామసాని చంద్రశేఖర్‌రెడ్డి, సీత శ్రవణ్‌కుమార్ ఉన్నారు.

సంస్థాన్ నారాయణపురం : బీఆర్‌ఎస్ నాయకులు హైదరాబాద్‌కు వెళ్తారనే సమాచారంతో పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్టు అయిన వారిలో బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ నర్రి నరసింహ, నాయకులు లారీ భిక్షం, జినుకల కిరణ్‌కుమార్, ఏర్పుల అంజమ్మ, సత్తయ్య, యాదిరెడ్డి, వెంకటేశ్, ముత్యాలు, ఉష, లింగస్వామి, ఆంజనేయులు, నర్సింహ ఉన్నారు.

బొమ్మలరామారం : పోలీస్ స్టేషన్‌లో బీఆర్‌ఎస్ నాయకులు

ఆలేరు టౌన్ : పోలీసుల అదుపులో బీఆర్‌ఎస్ నాయకులు

రాజాపేట పోలీస్ స్టేషన్‌లో ..

ఆత్మకూరు(ఎం) పోలీస్ స్టేషన్‌లో..

ఆత్మకూరు(ఎం) పోలీస్ స్టేషన్‌లో..

భువనగిరి కలెక్టరేట్ : పోలీసుల అదుపులో బీఆర్‌ఎస్ నాయకులు

భువనగిరి అర్బన్ : బీఆర్‌ఎస్ నాయకులను అరెస్టు చేస్తున్న పోలీసులు

వలిగొండ పోలీస్‌స్టేషన్‌లో బీఆర్‌ఎస్ నాయకులు

భూదాన్ పోచంపల్లి పోలీస్‌స్టేషన్‌లో..

తాగునీటి సమస్య పరిష్కారానికి సర్కారు చర్యలు

- తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్


మంచి నీటి ట్యాంకు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సామేల్

మోత్కూరు, సెప్టెంబర్ 13 : భవిష్యత్‌లో నీటి ఎద్దడి ఏర్పడకుండా రాష్ట్ర ప్రభుత్వం ముందుచూపుతో తాగునీటి వనరులను సమకూర్చుతున్నదని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. మున్సిపాలిటీలోని ఆరెగూడెం సమీపంలో అమృత 2.0 కింద రూ.12కోట్లతో మంజూరు చేసిన మంచినీటి ట్యాంకు నిర్మాణ పనులకు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచినీటి వ్యవస్థ మెరుగుపర్చడం కోసం ప్రభుత్వం ముందుచూపుతో చర్యలు తీసుకుంటుందన్నారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల ఫ్రెషర్స్ డే కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. పట్టణంలోని ఎస్సీ కాలనీలో వినాయక విగ్రహానికి పూజలు చేశారు. అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు ప్లేట్లు, కుర్చీలు, పలకలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం కవితా లక్ష్మీనర్సింహారెడ్డి, వైస్ చైర్మన్ బొల్లేపల్లి వెంకటయ్య, మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్, పబ్లిక్ హెల్త్ ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మితో పేదలకు కొండంత భరోసా : ఎమ్మెల్యే వీరేశం


కల్యాణలక్ష్మి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

రామన్నపేట, సెప్టెంబర్ 13 : కల్యాణ లక్ష్మి పథకం నిరుపేద కుటుంబాల మహిళలకు కొండంత భరోసాగా నిలిచిందని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. మండలంలోని కక్కిరేణి గ్రామంలో సీఐడీసీ ఆధ్వర్యంలో 90 రోజులు శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు శుక్రవారం కుట్టు మిషన్లు అందజేశారు. అనంతరం మండల కేంద్రంలోని రైతు వేదికలో 99మంది కల్యాణ లక్ష్మి లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తామన్నారు. అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రభుత్వ పథకాలు అర్హులకు అందేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో తాసీల్దార్ లాల్‌బహదూర్, ఎంపీడీఓ యాకూబ్‌నాయక్, సింగిల్‌విండో చైర్మన్ నంద్యాల భిక్షంరెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సిరిగిరెడ్డి మల్లారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

మదర్ డెయిరీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు

- ఆరు డైరెక్టర్ స్థానాలు వశం
- నేడు హయత్‌నగర్‌లో చైర్మన్ ఎన్నిక

విజయ సంకేతం చూపుతున్న ప్రభుత్వ విప్ ఐలయ్య

పోలింగ్ కేంద్రం వద్దకు వస్తున్న డీసీసీబీ మాజీ చైర్మన్ మహేందర్‌రెడ్డి

యాదాద్రి భువనగిరి, సెప్టెంబర్ 13 (నమస్తే తెలంగాణ) : ఉమ్మడి నల్లగొండ, రంగారెడ్డి పాల ఉత్పత్తిదారుల పరస్పర సహకార యూనియన్ లిమిటెడ్ (మదర్ డెయిరీ) హస్తగతమైంది. ఆరుకు ఆరు డైరెక్టర్ స్థానాల్లో కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులు గెలుపొందారు. ఖాళీగా ఉన్న ఆరు స్థానాల కోసం శుక్రవారం రంగారెడ్డి జిల్లాలోని హయత్‌నగర్ ఎస్వీ కన్వెన్షన్‌లో ఎన్నికలు నిర్వహించారు. ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఓటింగ్ జరిగింది. రంగారెడ్డి జిల్లాలో రెండు, యాదాద్రిలో నాలుగు స్థానాలు ఖాళీగా ఉండగా.. మొత్తంగా 297 మంది ఓటర్లు ఉన్నారు. యాదాద్రిలోని నాలుగు సీట్లకు కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నుంచి నలుగురు చొప్పున ఎనిమిది బరిలో నిలిచారు. అయితే.. ముందుగానే కాంగ్రెస్ పార్టీ క్యాంప్ రాజకీయాలు, తాయిలాలకు తెరదీసింది. ఒక్కో ఓటరుకు రూ.30వేల వరకు పంపిణీ చేసింది. అయినప్పటికీ బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థులు హోరాహోరీ పోటీనిచ్చారు. కాంగ్రెస్ బలపరిచిన యాదాద్రి జిల్లా అభ్యర్థులు కల్లెపల్లి శ్రీశైలానికి 222, గుడిపాటి మధుసూదన్‌రెడ్డికి 229, పుప్పాల నర్సింహులుకు 181, బత్తుల నరేందర్ రెడ్డికి 177 ఓట్లు వచ్చాయి. రంగారెడ్డి రిజర్వ్ స్థానాల్లో మండలి జంగయ్య యాదవ్‌కు 237, అగ్రాల నర్సింహారెడ్డికి 242 ఓట్లు పడ్డాయి. బీఆర్‌ఎస్ మద్దతు తెలిపిన సందిల భాస్కర్‌కు 104, కొండల్‌రెడ్డికి 110, ఒగ్గు భిక్షపతికి 71, దొంతిరి సోమిరెడ్డికి 76 ఓట్లు పోలయ్యాయి. కాగా శనివారం మదర్ డెయిరీలో చైర్మన్ ఎన్నిక జరుగనుంది. చైర్మన్‌గా ఆలేరు నియోజకవర్గంలోని తుర్కపల్లి మండలానికి చెందిన గుడిపాటి మధుసూదన్‌రెడ్డిని ఎన్నుకోనున్నట్లు తెలిసింది.

విద్యార్థులు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలి

- జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి యశోద

మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ యశోద

చౌటుప్పల్ రూరల్, సెప్టెంబర్ 13 : విద్యార్థులు బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి ఎస్.యశోద అన్నారు. తూఫ్రాన్‌పేట గ్రామంలోని ప్రభుత్వ బాలికల రెసిడెన్షియల్ కళాశాలలో శుక్రవారం జరిగిన ఆత్మహత్యల నివారణా వారోత్సవాల కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రణాళికాబద్ధంగా చదివి ఉన్నత శిఖరాలు అందుకోవాలన్నారు. ఫెయిల్ అయ్యామని నిరాశతో ఆత్మహత్యకు పాల్పడవద్దని సూచించారు. విద్యార్థులు ఏమైనా సమస్యలు ఉంటే 14416 నెంబర్‌కు ఫోన్ చేసి పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఐఓ డాక్టర్ రామకృష్ణ, వైద్యులు సుమన్‌కళ్యాణ్, ప్రీతి స్వరూప్, స్వప్న, మనోహర్ పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్య ప్రభుత్వ బడిలోనే సాధ్యం

- ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

యోగేశ్వర్‌రావు దంపతులను సత్కరిస్తున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

ఆలేరు టౌన్, సెప్టెంబర్ 13 : నాణ్యమైన, ప్రమాణాలతో కూడిన విద్య ఉన్నప్పుడే అభ్యున్నతి సాధ్యమని, విలువలతో కూడిన విద్య ప్రభుత్వ పాఠశాలల్లోనే అందుతుందని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. పట్టణంలోని జడ్పీహెచ్ఎస్‌లో శుక్రవారం నిర్వహించిన గోన యోగేశ్వర్‌రావు వీడ్కోలు అభినందన సభలో ఆయన మాట్లాడారు. సర్కారు బడులను కాపాడవలసిన బాధ్యత ఉపాధ్యాయులు, ప్రభుత్వంపై ఉన్నదన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన వారు ఆయా రంగాల్లో రాణిస్తారని తెలిపారు. అనంతరం యోగేశ్వర్‌రావు దంపతులను సత్కరించారు. దాసరి మంజుల అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి జనగాం ఉపేందర్‌రెడ్డి, ఉపాధ్యాయ నాయకులు కె.జంగయ్య, చావ రవి, దామోదర్, యాదయ్య, దూడల వెంకటేశ్, నారాయణ, శ్యామసుందరి, నరేంద్రస్వామి, కె.మల్లేశ్ పాల్గొన్నారు.

సాగులో మెళకువలు పాటిస్తే అధిక దిగుబడులు

పత్తి పంటను పరిశీలిస్తున్న ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు అనిల్‌కుమార్, మమత

మోత్కూరు, సెప్టెంబర్ 13 : రైతులు పంటల సాగులో మెళకువలు పాటిస్తే అధిక దిగుబడులు పొందవచ్చని ఏరువాక కేంద్రం శాస్త్ర వేత్తలు డాక్టర్ బి.అనిల్‌కుమార్, కె.మమత అన్నారు. పట్టణంలోని రైతు మోత్కూరి బ్రహ్మచారి సాగు చేసిన అధిక సాంద్రత పత్తి పంటను శుక్రవారం పరిశీలించారు. సాగులో రైతు అనుభవాలను అడిగి తెలుసుకున్నారు. సమయానుకూలంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచించారు.

వ్యక్తి ఆత్మహత్య

రాజాపేట, సెప్టెంబర్ 13 : మండలంలోని దూదివెంకటాపురంలో అనారోగ్యంతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వంకోల్ల వెంకటయ్య (60) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో మనస్తాపానికి గురైన వెంకటయ్య శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఆలేరు ప్రభుత్వ దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ వెంకటయ్య మృతిచెందాడు. కేసు నమోదు చేసుకొని మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్ఐ ఉపేందర్‌యాదవ్ తెలిపారు.

కాంగ్రెస్ దాడులను తిప్పికొడుతాం : బీఆర్‌ఎస్

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు వెంకటేశ్‌గౌడ్

బొమ్మలరామారం, సెప్టెంబర్ 13 : బీఆర్‌ఎస్ నాయకులపై కాంగ్రెస్ చేసే దాడులను తిప్పికొడుతామని బీఆర్‌ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు పోలగాని వెంకటేశ్‌గౌడ్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం జరిగిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయ దాడులు లేని రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రోద్బలంతో కాంగ్రెస్ గూండాలు భౌతిక దాడులకు దిగడం హేయమైన చర్య అన్నారు. దాడులను ఆపాల్సిన పోలీస్ యంత్రాంగం అధికార పార్టీ ఒత్తిడికి లోబడి బీఆర్‌ఎస్ నాయకులకు భద్రత కల్పించకపోగా అరెస్టులకు పాల్పడలం సిగ్గుచేటని విమర్శించారు. సమావేశంలో బీఆర్‌ఎస్ మండల నాయకులు కుషంగుల సత్యనారాయణ, బాల నర్సయ్య, పాపిరెడ్డి, మహేశ్ గౌడ్, ఉపేందర్, శ్రీకాంత్‌గౌడ్, మల్లేశ్, చారి పాల్గొన్నారు.

తెలంగాణ యాసను పరిరక్షించుకోవాలి


జూలూరులో హైస్కూల్‌లో మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయుడు ప్రభాకర్

భూదాన్ పోచంపల్లి, సెప్టెంబర్ 14 : మన యాసలోనే మన బతుకు, మన భాషలో మన సంస్కృతి ఉన్నదని, తెలంగాణ భాష, యాసను పరిరక్షించుకోవాలని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.ప్రభాకర్ అన్నారు. కాళోజీ జయంతిని పురస్కరించుకొని మండలంలోని జూలూరు గ్రామ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శుక్రవారం తెలంగాణ భాషా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాళోజీ సమాజ గొడవను తన గొడవగా భావించి కవిత్వం రాసి ప్రజా కవిగా గుర్తింపు పొందారని కొనియాడారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, ఉపన్యాసం, పద్య పఠనం పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మనోహర్, బి.వీరాచారి, సునీత, సహజీవన్, వెంకనర్స, రామ్మూర్తి, మంజుల, సుమని, అచ్చిరెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

జిట్టా విగ్రహ ఏర్పాటుకు కృషి చేయాలని ఎమ్మెల్యేకు వినతి


ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డిని కలిసిన జిట్టా అభిమానులు

భువనగిరి అర్బన్, సెప్టెంబర్ 13 : తెలంగాణ మలి దశ ఉద్యమకారుడు జిట్టా బాలకృష్ణారెడ్డి విగ్రహాన్ని భువనగిరి పట్టణంలో ఏర్పాటు చేసేందుకు కృషి చేయాలని జిట్టా అభిమానులు శుక్రవారం ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జిట్టా చేసిన కృషిని ఎమ్మెల్యేకు వివరించారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి.. బాలకృష్ణారెడ్డి విగ్రహ ఏర్పాటు కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

యాదిరెడ్డి సేవలు చిరస్మరణీయం : మాజీ ఎమ్మెల్యే శేఖర్‌రెడ్డి

యాదిరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే శేఖర్‌రెడ్డి

భూదాన్ పోచంపల్లి, సెప్టెంబర్ 14 : ప్రముఖ వ్యాపారవేత్త మాడుగుల యాదిరెడ్డి సేవలు చిరస్మరణీయమని మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి అన్నారు. మాడుగుల యాదిరెడ్డి వర్ధంతి సందర్భంగా మండలంలోని పెద్దగూడెం గ్రామ పరిధిలో ఆయన కాంస్య విగ్రహానికి గురువారం పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పైళ్ల మాట్లాడుతూ వ్యాపార రంగంలో యాదిరెడ్డి పలువురికి ఉపాధి కల్పించారన్నారు. వ్యాపార అభివృద్ధికి పలు సేవలందించారని, గ్రామ అభివృద్ధికి కృషి చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మాడుగుల ప్రభాకర్‌రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ పాక వెంకటేశ్‌యాదవ్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు పాటి సుధాకర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కందాల భూపాల్‌రెడ్డి, నాయకులు మల్లారెడ్డి, శ్రీనివాస్, వెంకటేశం, మల్లారెడ్డి, కుమార్, అఖిల, మహిపాల్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, మాధవరెడ్డి, జంగయ్య, నరేశ్, హరీశ్‌యాదవ్ పాల్గొన్నారు.

మోత్కూరులో డ్రైనేజీ పనులు ప్రారంభం

డ్రైనేజీ పనులను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ కవిత

మోత్కూరు, సెప్టెంబర్ 13 : మున్సిపాలిటీలోని సుందరయ్య కాలనీలో డ్రైనేజీ కాల్వ పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం కవితాలక్ష్మీనర్సింహారెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బొల్లేపల్లి వెంకటయ్య, కమిషనర్ శ్రీకాంత్, సిబ్బంది, కాలనీవాసులు పాల్గొన్నారు.

30న ధర్నాను విజయవంతం చేయాలి : ఐఎఫ్‌టీయూ

ఆలేరు టౌన్, సెప్టెంబర్ 13 : కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లు, మూడు క్రిమినల్ చట్టాలను రద్దు చేయాలని ఈ నెల 30న హైదరాబాద్‌లో చేపట్టనున్న ధర్నాను విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.జనార్దన్ కార్మికులను కోరారు. ఆలేరులో శుక్రవారం ధర్నా పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు, ఆటో డ్రైవర్లు ఓరుగంటి మైసయ్య, భాస్కర్, రమేశ్, శ్రీనివాస్, సిద్ధులు, శ్రీను, మురళి, గౌస్, మార్కండేయ పాల్గొన్నారు.

గోవుల అక్రమ రవాణాదారుల అరెస్టు

చౌటుప్పల్ రూరల్, సెప్టెంబర్ 13 : గోవులను అక్రమంగా తరలిస్తున్న ఇద్దరిని చౌటుప్పల్ పోలీసులు అరెస్టు చేశారు. చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌గేట్ వద్ద శుక్రవారం డీసీఎంను తనిఖీ చేయగా అందులో గోవులు కనిపించాయి. వాటిని ఆంధ్రప్రదేశ్‌లోని విజయనగరం నుంచి హైదరాబాద్‌కు తరలిస్తున్న హర్యానాకు చెందిన అఖిల్(35), విజయనగరానికి చెందిన సిగడ రమణ(32)ను అదుపులోకి తీసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ యాదగిరి తెలిపారు.

'కళాకారులకు నివాసం స్థలాలు ఇవ్వాలి'

తాసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న కళాకారులు

ఆలేరు టౌన్, సెప్టెంబర్ 13 : అర్హులైన గ్రామీణ కళాకారులకు నివాస స్థలాలు ఇవ్వాలని కోరుతూ తెలంగాణ ప్రజా నాట్యమండలి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం తాసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కళాకారులకు ప్రభుత్వ పరంగా గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ఇంటి నిర్మాణానికి ఆర్థిక సాయం అందించాలని, రూ.5వేల ఫించన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం తాసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్క వెంకటేశ్, నాయకులు ప్రవీణ్, ఎలేంద్ర, ఆండాలు, కవిత, ఉమ పాల్గొన్నారు.